హైస్కూల్ అభివృద్ధికి గ్రహణం

- సమస్యలతో కునారిల్లుతున్న డీఎస్ఎంసీ హైస్కూల్
- గతంలో రూ.3.41 కోట్ల మనబడి నాడు – నేడు నిధుల మంజూరు
- కూటమి ప్రభుత్వంలో నిలిచిపోయిన నిర్మాణ పనులు



డీఎస్ఎంసీ హైస్కూల్ నూతన భవన నిర్మాణ శిలాఫలకం



నిలిచిపోయిన డీఎస్ఎంసీ హైస్కూల్ నూతన భవన నిర్మాణ పనులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లో నిర్మిస్తున్న దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ కార్పొరేషన్ (డీఎస్ఎంసీ) హైస్కూల్ నూతన భవన నిర్మాణ పనులకు గ్రహణం పట్టింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మనబడి నాడు – నేడు కార్యక్రమంలో భాగంగా కుమ్మరిపాలెం సెంటర్‌లో బ్రిటిష్ కాలంలో నిర్మించిన డీఎస్ఎంసీ హైస్కూల్‌లో విద్యార్థుల సంఖ్యకు తగ్గట్లుగా తరగతి గదులు లేకపోవడంతో పాత భవనాన్ని తొలగించి నూతన భవనానికి రూ.3.41 కోట్ల నిధులను మంజూరు చేసింది. దీంతో అప్పటి పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు 2023 మార్చి 28న శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత హైస్కూల్ నూతన భవన నిర్మాణానికి పునాదులు తీయడం మొదలై బేస్‌మెంట్ స్థాయికి చేరుకుంది. అంతే ఇక అక్కడ నుంచి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన పనులన్నీ ఆగిపోయాయి.

నాడు – నేడు పనులపై తీవ్ర నిర్లక్ష్యం

డీఎస్ఎంసీ హైస్కూల్ నూతన భవన నిర్మాణానికి సంబంధించి నాడు – నేడు కార్యక్రమం నిబంధనల మేరకు స్కూల్ పేరెంట్స్ కమిటీ, మేనేజ్‌మెంట్ కమిటీ పేరుతో జాయింట్ ఎకౌంట్ ఉంటుంది. నగరపాలకసంస్థ ఇంజినీరింగ్ సెక్షన్ సూచనల మేరకు ఆయా కమిటీల సభ్యులే మెటీరియల్ కొనుగోలు చేస్తారు. నిర్మాణ పనుల్లో దశలవారీగా ప్రభుత్వం కమిటీ జాయింట్ ఎకౌంట్ ద్వారా చెల్లింపులు చేస్తుంది. నూతన భవన నిర్మాణానికి 2023 మార్చిలో శంకుస్థాపన చేస్తే తొలి దశగా ఆగస్టులో కొంత, తిరిగి గత ఏడాది జనవరి నెలలో మరికొంత మొత్తాన్ని చెల్లించింది. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మనబడి నాడు – నేడు కార్యక్రమాలను నిర్లక్ష్యం చేసింది. అందులో భాగంగానే డీఎస్ఎంసీ హైస్కూల్ నూతన భవన నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం పార్షియల్ బిల్ చెల్లించకపోవడంతో మేస్త్రి పనులు నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం ఈ హైస్కూల్ నూతన భవన నిర్మాణానికి నిధులు విడుదల చేస్తుందా.. లేదా పక్కన పెట్టేస్తుందా అన్న అనుమానాలు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో రేకెత్తుతున్నాయి.

ఇరుకు గదుల్లో పాఠాలు

డీఎస్ఎంసీ హైస్కూల్ పాత భవనాన్ని కూల్చేసిన తర్వాత 14 ఏళ్ల క్రితం స్కూల్ కోసం నిర్మించిన అదనపు తరగతి గదుల భవనం (గ్రౌండ్‌లో నాలుగు గదులు, ఫస్ట్ ఫ్లోర్‌లో మూడు గదులు)లో స్కూల్‌ను నడుపుతున్నారు. తరగతి గదులు చాలకపోవడంతో 13 సెక్షన్లను 9 సెక్షన్లకు కుదించి చదువు చెబుతున్నారు. ఒక గదిలో ల్యాబ్, ఇతర సామాన్లు ఉండటంతో ఇరుకుగా ఉండి ఒక తరగతి విద్యార్థులు అప్పుడప్పుడు వరండాలో కూర్చుని చదువుకుంటున్నారు. హైస్కూల్ నూతన భవనం ఎప్పటికి పూర్తవుతుంది.. అసలు పూర్తవుతుందా లేదా అని అటు విద్యార్థులు ఇటు ఉపాధ్యాయులు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని సమస్యలతో కునారిల్లుతున్న హైస్కూల్ భవన నిర్మాణాన్ని పూర్తి చేయించి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో పర్యావరణానికి హాని



ర్యాలీ నిర్వహిస్తున్న కార్పొరేటర్ రెహమతున్నీసా, సచివాలయ ఉద్యోగులు



బస్‌స్టేషన్ ప్రాంగణంలో చెత్తను తొలగిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

భవానీపురం(విజయవాడపశ్చిమ): పర్యావరణానికి హాని కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తుల వాడకాన్ని పూర్తిగా నిషేదించాలని 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా పిలుపునిచ్చారు. 38వ డివిజన్‌లోని 113వ వార్డు సచివాలయం పరిధిలోని మల్లికార్జునపేట అర్జున్ వీధిలో శనివారం స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెహమతున్నీసా మాట్లాడుతూ సూపర్ స్వచ్ఛత లీగ్‌లో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు స్థానం దక్కడం, అదేవిధంగా గార్బేజ్ ఫ్రీ సిటీ అవార్డు లభించడం వెనుక కృషి చేసిన నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్ర అభినందనీయులని పేర్కొన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్య కార్మికులు పడిన కష్టం మరువలేమన్నారు. స్పెషల్ ఆఫీసర్ సోమశేఖర రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేంద్ర, రాజస్థాన్ హైస్కూల్ విద్యార్థులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బస్‌స్టేషన్‌లో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర

బస్టాండ్(విజయవాడపశ్చిమ): పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ డెప్యూటీ సీటీఎం పవన్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం బస్‌స్టేషన్‌లో నిర్వహించిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. బస్‌స్టేషన్‌కు నిత్యం లక్షలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారని, అటువంటి బస్ స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ఉద్యోగులు, ప్రయాణికులపై ఉందన్నారు. సిబ్బందితో కలిసి బస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలను శుభ్రపరిచారు. అనంతరం పరిశుభ్రతపై సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. బస్‌స్టేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకానికి దూరంగా ఉండాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్లాస్టిక్ వాడకానికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని కార్పొరేటర్లు మరుపిళ్ల రాజేష్, మహాదేవు అప్పాజీరావు అన్నారు. 51, 53 డివిజన్లలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక మౌలానా ఆజాద్ నగరపాలకసంస్థ హైస్కూల్ విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వినియోగం మానుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్ గుర్రం శ్రీనివాసరావును సత్కరించారు.

మానవ అక్రమ రవాణా నేరం

రైల్వేస్టేషన్ డైరెక్టర్ శైలజ




అవగాహన కల్పిస్తున్న స్టేషన్ డైరెక్టర్ శైలజ

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): మానవ అక్రమ రవాణా పెద్ద నేరమని అందుకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని విజయవాడ రైల్వే స్టేషన్ డైరెక్టర్ ఎం.శైలజ పేర్కొన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని వాసవ్య మహిళా మండలి, చైల్డ్ హెల్ప్‌లైన్, ఆర్‌పీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం విజయవాడ రైల్వేస్టేషన్‌లో మానవ అక్రమ రవాణపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శైలజ మాట్లాడుతూ ప్రయాణంలో ఎవరైనా పిల్లలు ఒంటరిగా కాని, లేదా సమూహంగా ప్రయాణిస్తుండటాన్ని గుర్తిస్తే వెంటనే 1098, 1800–1027–222, 0866–2470966 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా సమాచారం అందించి మానవ అక్రమ రవాణా నిర్మూళనలో సహకరించాలని కోరారు. తల్లిదండ్రులు ప్రతిక్షణం తమ పిల్లల పట్ల జాగ్రత్తగా ఉంటూనే ప్రయాణంలో ఇతర పిల్లలను కూడా గమనించి అక్రమ రవాణ జరుగుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే సంబంధిత ఫోన్ నెంబర్ల ద్వారా అధికారులకు సమాచారం అందించి వారిని రక్షించాలని కోరారు. కార్యక్రమంలో వాసవి మహిళా మండలి సభ్యులు హృదయరాజు, సౌజన్య, ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ శ్రీనివాసరావు, చైల్డ్ హెల్ప్‌లైన్ సభ్యులు ప్రసాద్, బచపన్ బచావో ఆందోళన సంస్థ సభ్యుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు ఆషాఢ సారె

తరలివస్తున్న భక్త బృందాలు



సారె తీసుకువచ్చిన భక్త బృందాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న ఆషాఢ మాసోత్సవాలలో శనివారం పలు భక్తబృందాలు అమ్మవారికి సారెను సమర్పించాయి. ఎన్టీఆర్ జిల్లా విశ్వ బ్రహ్మణ సంఘం అధ్యక్షులు గొర్తి శ్రీనివాస చక్రవర్తి ఆధ్వర్యంలో పెద్దఎత్తున మహిళలు ఇంద్రకీలాద్రికి విచ్చేసి అమ్మవారికి సారెను సమర్పించారు. తొలుత ఘాట్‌రోడ్డు ప్రారంభంలోని కామధేను అమ్మవారిని దర్శించుకున్న భక్తబృందం పూలు, పండ్లు, పూజా సామగ్రిని సమర్పించి ఊరేగింపుగా కొండపైకి చేరుకుంది. తొలుత ప్రధాన ఆలయంలోని అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకున్న అనంతరం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి సారెను సమర్పించారు. దుర్గమ్మ ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ ఏటా సారెను సమర్పిస్తున్నట్లు భక్తబృందం తెలిపింది. అమ్మవారికి 40 రకాల వస్తువులను సారెగా సమర్పించినట్లు వారు వివరించారు. అదేవిధంగా కృష్ణా, గుంటూరు, ప్రకాశం, ఉభయ గోదావరి జిల్లాల నుంచి పెద్దఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారికి సారెను సమర్పించారు. సారె సమర్పించేందుకు విచ్చేసిన భక్తులు, భక్తబృందాలతో క్యూలైన్లు కిటకిటలాడాయి. సారె తీసుకువచ్చిన భక్తులకు రూ.300, రూ.100 క్యూలైన్‌లో ఉచితంగా అనుమతించారు.

రేపు 3,600 అడుగుల జాతీయ పతాక ప్రదర్శన

భవానీపురం(విజయవాడపశ్చిమ): వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన 3,600 అడుగుల జాతీయ పతాకాన్ని ప్రదర్శించనున్నట్లు క్లబ్ పూర్వపు అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా పేర్కొన్నారు. 45వ డివిజన్ పరిధిలోని ఆర్యవైశ్య కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సోమవారం ఉదయం 9 గంటలకు భవానీపురం చర్చి సెంటర్ నుంచి ఈ భారీ జాతీయ పతాకం ప్రదర్శన స్వాతి సెంటర్ వరకు సాగుతుందన్నారు. అనంతరం జాతీయ పతాక ప్రదర్శన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సంస్థ అడ్మినిస్ట్రేటివ్ ఉపాధ్యక్షుడు మామిడి శ్రీనివాసరావు, ఐఈఎస్ ఆఫీసర్స్ పీవీడీ ప్రసాదరావు, కేఎల్‌వీ సతీష్, జిల్లా గవర్నర్ తూనుగుంట్ల శ్రీధర్, వీసీఎస్ అండ్ టీఏ అధ్యక్షుడు ఎం. శ్రీహరిరావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సూపర్ స్వచ్ఛత లీగ్ గర్వకారణం

మేయర్ రాయన భాగ్యలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): సూపర్ స్వచ్ఛత లీగ్ పురస్కారాన్ని భారత దేశ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా విజయవాడ నగర పాలక సంస్థ అందుకోవడం గర్వకారణమని వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. పురస్కారం అందుకున్న సందర్భంగా వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 10 లక్షల జనాభా ఎక్కువగా ఉన్న జాబితాలో విజయవాడ నగర పాలక సంస్థ, ఇండోర్, సూరత్, నవీ ముంబై తర్వాత చేరుకోవడం ఇదే మొదటి సారన్నారు. దీనితోపాటు విజయవాడకు గార్బేజ్ ఫ్రీ సిటీ కేటగిరీలో సెవెన్ స్టార్ రేటింగ్ వచ్చిందని, 2021 తర్వాత మళ్లీ 2024లో అవార్డు అందుకోవడం తనకు ఇది రెండవసారి అని వివరించారు. ఇప్పటివరకు విజయవాడ నగర పాలక సంస్థ స్వచ్ఛ సర్వేక్షణ్ ఉత్తమ స్థానాలలోనే నిలుస్తున్నందున సూపర్ స్వచ్ఛత లీగ్ పురస్కారం దక్కిందని చెప్పారు. పురస్కారం రావటానికి ముఖ్యకారమైన ప్రజలు, పారిశుధ్య కార్మికులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ మాట్లాడుతూ ఉత్తమ పురస్కారానికి పారిశుద్ధ్య కార్మికులు ఎనలేని కృషి చేశారన్నారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీ శైలజ రెడ్డి మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది, కార్పొరేటర్ల కృషితోనే అవార్డు సాధించామన్నారు. వైఎస్సార్ సీపీ ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ సమష్టి కృషితోనే పురస్కారం లభించిందన్నారు. వీఎంసీ కార్మికులు తమ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ సమ్మె చేస్తున్నారని, దీన్ని ప్రభుత్వం దృష్టిలో పెట్టుకుని కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

మానసిక దివ్యాంగులకు ఉచిత వైద్యం అభినందనీయం

- రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ అధ్యక్షుడు బాలగోపాల్
- నోరా ఫౌండేషన్ చైల్డ్ డెవలప్‌మెంట్, రీహాబిలిటేషన్ సెంటర్ ప్రారంభం



రిబ్బన్ కట్ చేసి నోరా ఫౌండేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న బాలగోపాల్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మానసిక ఎదుగుదల లేని పిల్లలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు నోరా ఫౌండేషన్ వారు ముందుకు రావడం అభినందనీయమని రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ అధ్యక్షుడు ఎస్.బాలగోపాల్ అన్నారు. సింగ్‌నగర్ నందమూరి నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన నోరా ఫౌండేషన్ చైల్డ్ డెవలప్‌మెంట రీహాబిలిటేషన్ సెంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. నోరా ఫౌండేషన్ వారు ఉచితంగా స్పీచ్ థెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, ఫిజియోథెరపీ, బిహేవియరల్ థెరపీ, పేరెంట్స్ కౌన్సెలింగ్, ఫ్యామిలీ గైడెన్స్, డైలీ లివింగ్ స్కిల్స్‌ను ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. రోటరీ క్లబ్ తరపున ఫౌండేషన్ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. నోరా ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ మానసిక ఎదుగుదల లేని పిల్లలకు ఎటువంటి చికిత్స అందించలేక ఇళ్లల్లోనే వదిలేస్తున్నారని చెప్పారు. అటువంటి వారందరిని గుర్తించి విజయవాడలో తమ సంస్థ ద్వారా రీహాబిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని, నగరం, జిల్లాలోని ప్రజలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల వారంతా దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫౌండేషన్ డైరెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.

కార్డియాక్ ఎమర్జెన్సీలో సీపీఆర్ కీలకం


సీఎంఎస్ డాక్టర్ శ్రీనివాసు



నిపుణుల సమక్షంలో నమూనాల ద్వారా సీపీఆర్ చేస్తున్న సిబ్బంది

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): కార్డియాక్ ఎమర్జెన్సీలో సకాలంలో సరైన పద్ధతిలో సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలను రక్షించవచ్చని రైల్వే హాస్పటల్ సీఎంఎస్ డాక్టర్ శ్రీనివాసు పేర్కొన్నారు. శనివారం డివిజినల్ హాస్పటల్‌లోని సెమినార్ హాలులో కార్డియాక్ ఎమర్జెన్సీ పరిస్థితిలో నర్సింగ్, క్లినికల్ సిబ్బందికి అత్యవసర స్పందనపై సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిససిటేషన్)పై వర్కుషాపు నిర్వహించారు. ఈ సెమినార్‌లో పాల్గొన్న సీఎంఎస్ డాక్టర్ శ్రీనివాసు బెసిక్ లైఫ్ సపోర్టు, డీఫ్రిబ్రిలేటర్లు, ఆటోమెటేడ్ ఎక్స్‌టర్నల్ డీఫిబ్రిలేటర్ల వాడకం, కార్డియాక్ ఎమర్జెన్సీలలో ఈసీజీ వంటి అంశాలపై పిల్లలు, పెద్దల నమూనా బొమ్మలతో సిబ్బందికి అవగాహన కల్పించారు. ఇటువంటి శిక్షణలు సిబ్బందికి చాలా ముఖ్యమని తెలిపారు. క్లిష్టసమయంలో ఏమి చేయాలో తెలుసుకోవడం మాత్రమే కాదని, వాటిని సరైన సమయంలో, సరైన పద్ధతిలో ఎలా ఉపయోగించాలో తెలిసుండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏసీఎంఎస్‌లు డాక్టర్ రవికాంత్, ఎం.జైదీప్, అనస్టీషియాలజిస్ట్ డాక్టర్ ఎ.శివరామ్, కార్డియాలసిస్ట్ డాక్టర్ సాయి ప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

అటల్ ల్యాబ్‌ల నిర్వహణపై వర్క్‌షాప్



రిసోర్స్‌పర్సన్లను సత్కరిస్తున్న విద్యాశాఖాధికారులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాఠశాలల్లోని అటల్ ల్యాబ్‌లను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్ది విద్యార్థులకు చేరువ చేయాలని జిల్లా సైన్స్ అధికారి కల్లేపల్లి పిచ్చేశ్వర రావు సూచించారు. నగరంలోని మారీస్ స్టెల్లా కళాశాలలో రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి పిచ్చేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు సైన్స్‌పై అభిరుచిని పెంపొందించే దిశగా విద్యాసంస్థల్లోని రిసోర్స్‌పర్సన్లు పనిచేయాలన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధే లక్ష్యంగా స్థాపించిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. రిసోర్స్‌పర్సన్‌గా హాజరైన సీనియర్ ఉపాధ్యాయుడు జీ సామ్యూల్ మాట్లాడుతూ డిజైన్ థింకింగ్, ఏఐ టూల్స్, ఎలక్ట్రానిక్స్, సోలార్ పవర్ రోబోటిక్స్, కోడింగ్, అటల్ డాష్‌బోర్డ్ అంశాలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లోని అటల్‌ల్యాబ్‌లలో విద్యార్థుల నైపుణ్య అభివృద్ధి పెరిగేందుకు వారిని ప్రోత్సహించాలని కోరారు.

క్లుప్తంగా

మంచినీటి సరఫరాపై ఈఓ ఆగ్రహం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భక్తుల సౌకర్యార్థం చేపట్టిన అభివృద్ధి పనుల్లో పురోగతి కనిపించాలని, ఆలయ ప్రాంగణంలో మంచినీటి సరఫరా మరింత మెరుగ్గా ఉండాలని దుర్గగుడి ఈఓ శీనానాయక్ ఆదేశాలు జారీ చేశారు. కుళాయిల వద్ద కనీసం గ్లాసులు కూడా అందుబాటులో లేకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఈఓ శీనానాయక్ శనివారం పరిశీలించారు. తొలుత కొండపై రాధాకృష్ణుల విగ్రహం వద్ద నిర్మాణంలో ఉన్న పూజా మండపాలను పరిశీలించారు. శ్రావణ మాసం నాటికి పూజా మండపాలు, నూతన యాగశాల పనులు పూర్తి కావాలని ఆదేశించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు మంచినీటిని సరఫరా చేయడంలో అలసత్వం వద్దని హెచ్చరించారు.

టీబీపై అవగాహన



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రధానమంత్రి టీబీముక్తి భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 51వ డివిజన్ ఆంజనేయవాగు కొండ ప్రాంతంలో స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ప్రజలకు టీబీ వ్యాధిపై శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన స్థానిక కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ మాట్లాడుతూ అవగాహన కలిగి ఉండటం ద్వారా టీబీ వ్యాధి బారినపడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. డాక్టర్ సల్మాఖాతన్ మాట్లాడుతూ టీబీ వ్యాధి లక్షణాలు, చికిత్సా విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో కేంద్ర సిబ్బంది, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. తొలుత పలువురికి టీబీ పరీక్షలు నిర్వహించారు.

బాబాయిపై దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):బాబాయిపై దాడికి పాల్పడిన యువకుడిపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు..గొల్లపాలెంగట్టు సాయిబాబాగుడి ప్రాంతంలో షేక్ దస్తగిరి కుటుంబం నివాసం ఉంటోంది. శుక్రవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చిన దస్తగిరి, అతని అన్నకొడుకు ఖలీల్‌కు మధ్య వివాదం చోటు చేసుకుంది. దీంతో ఖలీల్ తనబాబాయిపై కర్ర, గాజుపెంకుతో దాడి చేయడంతో కంటిపై గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు కుటుంబానికి ‘ట్విల్స్’ బాసట

ఓల్గా ఆర్చరీ అకాడమీకి రూ.10 లక్షల సాయం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బంగారు కుటుంబానికి మార్గదర్శకులై భవిష్యత్‌కు బాటలు వేసిన ట్విల్స్ షోరూం అధినేత జయేష్ కుమార్ అభినందనీయులని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. పేదరిక నిర్మూలన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన పీ4 విధానానికి తాను సైతం భాగస్వామిని అవుతానని జయేష్ కుమార్ ముందుకు వచ్చి బంగారు కుటుంబం అయిన ఓల్గా ఆర్చరీ అకాడమీని దత్తత తీసుకున్నారు. ఈ మేరకు కలెక్టరేట్ చాంబర్‌లో శనివారం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశను కలిసి రూ. 5 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం తరఫున జయేష్ కుమార్‌ను కలెక్టర్ అభినందించారు. అనంతరం ఓల్గా అకాడమీ అభివృద్ధికి అవసరమైన రూ. 10 లక్షల నిధిలో భాగంగా తొలి విడతగా రూ. 5 లక్షల చెక్కును అకాడమీ కోచ్ చెరుకూరి సత్యనారాయణకు కలెక్టర్ అందజేశారు. మరో రూ. 5 లక్షలను పది రోజుల్లో అందజేస్తారన్నారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహిళ బైక్‌కు అడ్డుతగిలి చెడుగా ప్రవర్తించడమే కాకుండా ఆమెపై దాడి చేసిన ఘటన భవానీపురం బౌట్ ఏజెన్సీలో జరిగింది. పోలీసులు తెలిపిన కథనం... బౌట్ ఏజెన్సీకి చెందిన జొన్నకూటి విజయ ఈనెల 17వ తేదీ రాత్రి పిల్లలను ట్యూషన్ వద్ద వదిలిపెట్టి తిరిగి ఇంటికి వస్తోంది. ఆ సమయంలో షేక్ రజాక్ ఆమెకు బైక్‌కు అడ్డుతగిలి చెడుగా ప్రవర్తించాడు. విజయ ఇంటికి వెళ్లి జరిగిన విషయం భర్తకు వివరించింది. ఇద్దరు కలిసి రజాక్ వద్దకు రాగా అతను, అతని స్నేహితుడు చాంద్‌బాషా కలిసి విజయపై దాడి చేశారు. చేతులతో కొడుతూ కాళ్లతో తన్ని కాల్వలో పడేశారు. ఈ దాడిలో గాయపడిన ఆమెను బంధువులు జీజీహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

క్రిస్టియన్ మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో క్రిస్టియన్ మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం రాష్ట్ర అధికారప్రతినిధిగా నియమితులైన రుద్రపాటి తేజ్‌కుమార్‌కు ఆపార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు సూచించారు. రుద్రపాటి తేజ్‌కుమార్ శనివారం ఆపార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు రుద్రపాటి, వెలంపల్లి శ్రీనివాసరావులను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీలో కష్టపడే ప్రతిఒక్కరికీ అధిష్టానం న్యాయం చేస్తుందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల జీవితాలు చిన్నాభిన్నమయ్యాయని విమర్శించారు. ప్రజల జీవితాలలో శాశ్వత వెలుగులు నింపాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వైఎస్సార్ సీపీ తిరిగి అధికారంలోకి వచ్చేందుకు పార్టీ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రుద్రపాటి తేజ్ కుమార్ మాట్లాడుతూ పార్టీలో సముచితస్థానం కల్పించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సహకరించిన వెలంపల్లి శ్రీనివాసరావులకు కృతజ్ఞతలు తెలియజేశారు. క్రిస్టియన్ మైనార్టీల సమస్యల పరిష్కారానికి పనిచేస్తానని వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ప్రతిభావంతులను గుర్తించి వారిని ‘ప్రైడ్ ఆఫ్ ఇండియా, ఐకాన్ ఆఫ్ ఇండియా– 2025’ పురస్కారంతో సత్కరిస్తామని ఆల్ దిబ బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ స్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టారు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన ప్రతిభావంతులను ఆగస్టు 17న హైదారాబాద్‌లో పురస్కారంతో సత్కరిస్తామని చెప్పారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు ఈనెల 31లోగా ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, డోర్ నం. 1-20-164, గోకుల్ నగర్, వెంకటాపురం, పోస్టు, తిరుమలగిరి, సికింద్రాబాద్ - 15కు దరఖాస్తులు పంపించాలన్నారు. మరింత సమాచారం కోసం సెల్: 96523 47207 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాతగొడవల నేపథ్యంలో ఓవ్యక్తిపై దాడికి పాల్పడిన వారిపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు అంబాపురంనకు చెందిన ఒమ్మి అప్పారావు, సామ్రాజ్యం భార్యభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు. గొడవల కారణంగా భార్యాభర్తలు విడివిడిగా ఉంటున్నారు. ఈ నెల 18వ తేదీన అప్పారావు తన చిన్న కుమార్తెను తీసుకుని తల్లి దగ్గర వదిలేందుకు వెళ్లాడు. అయితే ఇంట్లో పెద్దకుమార్తె కనిపించకపోవడంతో మేఘన ఎక్కడ అని ప్రశ్నించాడు. దీంతో భార్య సామ్రాజ్యం, సుబ్బారావు, గంగాధరరావు, రమేష్ అనేవారు అప్పారావు కళ్లలో కారం కొట్టి దాడి చేసి గాయపరిచారు. దీంతో బాధితుడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మతిస్థిమితం లేని వివాహిత అదృశ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మతిస్థిమితం లేని వివాహిత అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లంబాడీపేట జయంతి అపార్టుమెంట్‌లో షేక్ అబ్దుల్ గఫర్, మహ్మద్ జామి బేగం దంపతులు నివాసం ఉంటారు. జామి బేగంకు మతిస్థిమితం సరిగా ఉండదు. ఈనెల 17వ తేదీ రాత్రి భార్యభర్తలిద్దరు భోజనాలు చేసిన తర్వాత జామి బేగం ఇంటి ముందు కూర్చుంది. అయితే భర్త గఫర్ 12 గంటల సమయంలో నిద్రలోకి జారుకోగా, తెల్లవారుజామున మెలుకువ వచ్చింది. ఇంట్లో భార్యను చూడగా ఆమె కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.